క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



టేకుమట్ల: మండలంలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు అక్కల మాదవ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా ఆదివారం ఆయన కుటుంబాన్ని మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి పరామర్శించి, ఆర్థిక సాయాన్ని అందించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, కుటుంబానికి భరోసా కల్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, మండల నాయకులు కోంద్ర ఓదెలు, మూగయ్య, శంకర్, సాంబయ్య, భద్రయ్య, తదితరులు ఉన్నారు.

ఆపరేటర్ల సంక్షేమానికి కృషి



ఏటూరునాగారం: గ్రామీణ కేబుల్ టీవీ ఆపరేటర్ల సంక్షేమం కోసం పనిచేస్తామని ఆసంఘం అధ్యక్షుడు చెన్న రాంబాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంజే ఫంక్షన్ హాల్‌లో జరిగిన నూతన కమిటీ ఎన్నిక, పలు సమస్యలపై సుదీర్ఘమైన చర్చ నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా చెన్న రాంబాబును ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఇబ్రహీం(వలీ)వాజేడు, కోశాధికారిగా ధనిశెట్టి శివకృష్ణ వాజేడు, ఉపాధ్యక్షుడు గారపాటి రాంబాబు, గౌరవ అధ్యక్షుడిగా అలువాల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా బత్తిని రమేశ్, దాసుల రాజు, ఆడెపు శంకర్, పైడాకుల రవి, వేణుమాదవ్, ఇర్సవడ్ల శ్రీకాంత్, ఆడెపు శ్రీధర్‌లతోపాటు వాజేడు, ఏటూరునాగారం, మంగపేట, వెంకటాపురం(కె) తదితర గ్రామాల ఆపరేటర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం ఆదర్శప్రాయం



గార్ల: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆలోచనా విధానం బావితరాలకు ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని పెద్దకిష్టాపురం గ్రామంలో ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బాపనపల్లి సుందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహాన్ని అవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలోని చిన్నబంజర గ్రామంలో మోతీలాల్ వితరణ చేసిన సిమెంట్ బెంచీలను ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, జిల్లా నాయకుడు గుండా వెంకట్‌రెడ్డి, భూక్యా నాగేశ్వరరావు, కట్టా శ్రీనివాసరావు, తాళ్లపల్లి కృష్ణగౌడ్, గంగావత్ రాంసింగ్, హతీరాం, తదితరులు పాల్గొన్నారు.

పనులు చేయకుండానే బిల్లుల డ్రా

కొత్తగూడ: పనులు చేయకుండానే బిల్లులు డ్రా చేసినట్లు ఓటాయి గ్రామ సామాజిక తనిఖీల్లో గుర్తించినట్లు ఆదివారం జరిగిన గ్రామ సభలో వెల్లడించారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క కొత్తగూడ మండలానికి ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఇదే అదునుగా పంచాయతీరాజ్ శాఖ ఏఈ తన చేతి వాటాన్ని చూపించి స్థానికులతో కుమ్మక్కై పనులు చేయకుండానే బిల్లులు డ్రా చేసినట్లు స్థానికులు ఆరోపించారు.

గూడూరును రెవెన్యూ డివిజన్‌గా గుర్తించాలి

గూడూరు: గూడూరు మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా గుర్తించాలని, గిరిజనేతరుల ఆస్తులకు, హక్కులకు రక్షణ కల్పించాలని నాన్ ట్రైబల్ కన్వీనర్ కత్తి స్వామి కోరారు. మండల కేంద్రంలోని మహేశ్వర గార్డెన్‌లో ఆదివారం ధర్మయుద్ధం పేరుతో నాన్ ట్రైబల్ గ్రామ ప్రజల ఆత్మగౌరవ సభ నిర్వహించారు. వెయ్యి మందికి పైగా హాజరైన ఈ సభలో ఆయన మాట్లాడుతూ.. గూడూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని గిరిజనేతరులను జీపీకి సంబంధంలేని ఓ వ్యక్తి ఇటీవల కుల సంఘం పేరుతో గిరిజనేతరులను బెదిరింపులకు గురిచేయడం దారుణమన్నారు. జాతీయ రహదారి కలిగి గిరిజనేతరులు ఎక్కువగా ఉన్న గూడూరు అభివృద్ధికి నోచుకోవడంలేదన్నారు.

ఎవరీ పేకాట ‘చారి’ ?

- గుట్టుచప్పుడు కాకుండా క్లబ్ నిర్వహణ
- రూ.లక్షల్లో చేతులు మారుతున్న వైనం



టేకుమట్ల: జిల్లాలోని పలు మండలాల్లో ఇప్పుడు పేకాట క్లబ్బులను మూడో కంటికి తెలియకుండా నిర్వహిస్తూ ఒక్క రోజులో రూ.లక్షల్లో సంపాదిస్తున్నాడు.. అతనే ‘చారి’. చారీ ఎక్కడి నుంచి వస్తున్నాడు, ఎక్కడ పేకాట క్లబ్‌ను నిర్వహిస్తున్నాడనే సమాచారం పేకాట రాయుళ్లకు మినహా ఎవరికీ తెలియదు. పేకాట డెన్‌లోకి ప్రవేశించాలంటే పేకాట క్లబ్‌కి కొంత దూరంలో ఉండే ఇద్దరు సెక్యూరిటీ వ్యక్తులను దాటి వెళ్లాల్సి ఉంటుంది. కొత్తగా పేకాట క్లబ్‌కి వచ్చే వారికి ఒక కోడ్ తెలియాలి. కోడ్ చెప్పేనే డెన్‌లోకి ప్రవేశం. ఆ కోడ్ పేరే ‘చారీ అన్న రమ్మంటున్నాడు’. అలా రహస్యంగా కోడ్‌ను వాడుతూ పేకా ట క్లబ్‌ను జిల్లా కేంద్రంతోపాటు, టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి, రేగొండ మండలాల్లో రహస్య కేంద్రాల్లో నిర్వహిస్తున్నాడనే సమాచారం. చారీ.. జిల్లాతోపాటు, తెలంగాణ, మహారాష్ట్రకు చెందిన పలువురు పేకాట రాయుళ్లను క్లబ్‌కి చేర్చి నిర్వహణ ఖర్చు భరిస్తూ రోజుకు రూ.లక్షల్లో సంపాదిస్తున్నట్లు వినికిడి. చారీ తెలంగాణలోనే కాకుండా పలు రాష్ట్రాల్లో పేకాట క్లబ్‌లను నిర్వహిస్తున్నట్లు సమాచారం.

టేకుమట్లలో తప్పించుకున్నాడు.?

ఇటీవల మండలంలోని ఆశిరెడ్డిపల్లి శివారులో నిర్వహించిన పేకాట క్లబ్‌పై సీసీఎస్, టేకుమట్ల సివిల్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో ఆరుగురు పేకాట రాయుళ్లను ఆరెస్టు చేశారు. కానీ పేకాట క్లబ్‌కు ఇతర జిల్లాల నుంచి వచ్చే వారు రాక ముందే పోలీసులు దాడులు చేయడంతో కేవలం రూ.33వేల నగదుతోపాటు రెండు ద్విచక్ర వాహనాలు సీజ్ అయ్యాయి. దాంతో అసలైన వ్యక్తులు కాకుండా స్థానికులపై కేసులు నమోదైనట్లు సమాచారం. దాడుల సమయం మరికాస్త ఆలస్యమైతే చారీతోపాటు, ముఖ్యులు పట్టుబడే వారని చర్చ.

దాడులు చేపించింది చారినేనా..?

ఒక ప్రాంతంలో పేకాట క్లబ్‌ను నిర్వహిస్తూ ఏదో ఒక రోజు పేకాటకు వచ్చే కొత్తవాళ్లను, తక్కువ నగదుతో దొరికే విధంగా పోలీసులకు చారీనే సమాచారం అందించి వారిని పట్టిస్తాడని, మరుసటి రోజు నుంచి పోలీసుల దృష్టిమరల్చి పెద్దమొత్తంలో పేకాట క్లబ్‌ను నిర్వహిస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగానే ఇటీవల మండలంలో కొనసాగిన పేకాట స్థావరంపై పోలీసుల దాడీ అని చర్చ వినిపిస్తుంది. ఈ దాడి వెనుక చారీ పాత్ర ఉందనే అనుమానాలను వ్యక్తమవుతున్నాయి. గత కొంత కాలంగా పేకాటను చారీ నిర్వహిస్తున్నాడని, ఇంతకీ ఎవరీ చారీ, ఎక్కడి నుంచి వస్తున్నాడు, డెన్ ఎక్కడా..? అంటూ జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

మల్హర్: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల వెంటనే అమలు చేసి, ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. టీయూఎఫ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రమైన తాడిచర్లలో మండల అధ్యక్షుడు బూడిద సతీశ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెరవేర్చి ఉద్యమకారులకు బంధువుగా మారాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులు పెన్షన్లు సంక్షేమ పథకాల్లో వాటను అందజేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లలో ఉద్యమకారులకు 10 శాతం వాటా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులను రాష్ట్ర సాధకులుగా గుర్తించి గౌరవించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఉద్యమ అమరవీరులు, ఉద్యమకారులకు పింఛన్, బస్, ట్రైన్ పాసులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలోజు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు యాదండ్ల గట్టయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ముడితనపెల్లి ప్రభాకర్, జిల్లా అధికార ప్రతినిధి బోయిని రాజయ్య యాదవ్, రాష్ట్ర కో కన్వీనర్ దుబాసి పార్వతక్క, మహిళా మండల అధ్యక్షురాలు బండారి యశోద, రాష్ట్ర నాయకురాలు గడ్డం సమ్మక్క, ఉద్యమకారులు షేక్ చాంద్ పాషా, మీనుగు నాగయ్య, తోకల గట్టయ్య, అవిర్నేని పురుషోత్తం రావు, రౌతు భీమయ్య, ఇండ్ల శివ సారయ్య తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



ఫోన్‌ను బాధితుడికి అందజేస్తున్న పోలీసులు

కాటారం: మండలంలోని వీరాపూర్‌కు చెందిన గుంటి కుమార్ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనుక్కొని తిరిగి బాధితుడికి ఆదివారం అందజేసినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. కొన్ని రోజుల క్రితం కుమార్ మండలంలో తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేశారు. పోర్టల్ ద్వారా ఫోన్ రికవరీ చేసి బాధితుడికి అప్పగించారు. ఫోన్‌ను అందించిన పోలీసులకు కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మల్హర్: వారంత చిన్ననాటి స్నేహితులు.. ఒకేచోట చదువుకున్నారు.. పదో తరగతి పూర్తయ్యాక కొంత మంది ఉద్యోగాల్లో స్థిరపడగా, మరికొంత మంది వ్యాపారం, ఇతర రంగాల్లో కొనసాగుతున్నారు. మండల కేంద్రం తాడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988–89 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు గనుకోట నరహరి, గట్టు మధుకర్‌ను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. పూర్వ విద్యార్థులందరూ ఒకేచోట చేరవడంతో సందడి నెలకొంది. కార్యక్రమంలో దండు రమేశ్, గుమ్మడి రవీందర్, మిర్యాల దీలీప్‌రావు, జలపతిరావు, కోట సమ్మయ్య, రమాదేవి, ఓదేలు, గీత, శారద, కళావతి, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

కాటారం: అఖిల భారత యాదవ సంఘం మహాసభ శంకరాంపల్లి నూతన గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జాగరి ఓదేలుయాదవ్, అధ్యక్షుడిగా జాగరి వెంకటస్వామి, ఉపాధ్యక్షులుగా పర్శవేణ ఓదేలు, గెల్లు రాజు, జాగరి మహేశ్, ప్రధాన కార్యదర్శిగా జాగరి సమ్మయ్య, కోశాధికారిగా మధురబోయిన కుమారస్వామి, ముఖ్యసలహాదారుడిగా జాగిరి రాజయ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో డివిజన్ యాదవ సంఘం హడక్ కమిటీ సభ్యులు గడ్డం చంద్రయ్యయాదవ్, గడవేణ దేవేందర్‌యాదవ్, అబ్బినవేణ ఐలయ్య, తొట్ల శ్రీశైలం, సంఘం సభ్యులు రాజయ్య, రాజబాబు, మహేశ్, రంజిత్, ఓదేలు, దేవేందర్, గెల్లు రాజు తదితరులు పాల్గొన్నారు. నూతన కమిటీకి నియామకపత్రం అందజేసి అభినందనలు తెలిపారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న రాజమౌళి

నెహ్రూసెంటర్: ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి అన్నారు. గాంధీపురం శాఖ మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎర్రజెండా పోరాటాల ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. హామీలను విస్మరిస్తే ప్రజా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మహాసభలో గండమల్ల ఉప్పలయ్య, నర్సయ్య, కాగితపు నర్సయ్య, లింగయ్య పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

- కాటారం సీఐ నాగార్జునరావు



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న పోలీసులు

కాటారం: సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా గ్రామాల్లో నేరాల నియంత్రణ కావడంతోపాటు నేరపరిశోధన సులభతరం అవుతుందని కాటారం సీఐ నాగార్జున రావు అన్నారు. కాటారం మండలం గంగారం ఎక్స్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్సై మ్యాక అభినవ్‌తో కలిసి సీఐ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానంగా పని చేస్తుందన్నారు. నేర పరిశోధనలో ఈ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామాల్లో అనుమానితుల సంచారం, అసాంఘిక కార్యకలాపాల నిర్వహణపై పోలీసులతోపాటు సీసీ కెమెరాల నిఘా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాలనీకి నీళ్లు రావడం లేదు

- ఖాళీ బిందెలతో నిరసన



నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

ములుగు రూరల్: మండలంలోని బండారుపల్లి మహత్మగాంధీ కాలనీలో గత పది రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా పది రోజులుగా నిలిచిపోయిందని తెలిపారు. ఈ మేరకు శనివారం మహిళలు ఖాళీ బిందలతో రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మిషన్‌భగీరథ నల్లాలు రావడం లేదని పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని తెలిపారు. దీంతో బోర్లు ఉన్నవారి వద్ద నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నామని అన్నారు. కాలనీలో చేతి పంపు రిపేరు వచ్చి మూడు నెలలు గడుస్తున్నా.. మరమ్మతులు చేయించడం లేదని అన్నారు. నల్లా పైప్‌లైన్ గేట్‌వాల్వ్ రిపేరు ఉందని తెలిసినా.. మరమ్మతులు చేపట్టడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారలు స్పందించి నీటి సమస్యను తీర్చాలని కోరారు.

మత్స్యకారుల సంక్షేమాభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



చెరువులో చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

రేగొండ: మత్స్యకారుల సంక్షేమాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందనిభూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని చౌటకుంటలో జిల్లా మత్స్య శాఖ అధికారి అవినాశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి కోసం వంద శాతం సబ్సిడీపై చేప పిల్లలను పంపిణీ చేస్తుందన్నారు. ఉచిత చేప పిల్లల పంపిణీ మత్స్యకారులు ఆదాయ వనరులను మెరుగుపరుచుకోవాడానికి దోహదపడుతుందన్నారు. గత ప్రభుత్వం హయాంలో గొర్రెలు, చేప పిల్లల పంపిణీలో అవినీతి జరిగిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల అమలులో చిత్తశుద్ధితో పని చేస్తున్నట్లు తెలిపారు.

చెక్కుల పంపిణీ

మండల కేంద్రంలోని రైతువేదికలో రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలోని వివిధ గ్రామాలకు చెందిన 41 మంది సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు కార్పోరేట్ స్థాయిలో వైద్యం అందించేందుకు ఈ పథకం అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, బుగులోని జాతర చైర్మన్ రొంటాల వెంకటస్వామి, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు సంపత్‌రావు, పుల్లూరి బాబురావు, మోడెం ఉమేశ్‌గౌడ్, సూదనబోయిన ఓంప్రకాశ్, పున్నం రవి, పట్టెం శంకర్, నిమ్మల విజేందర్, బొజ్జం రవి, మైస భిక్షపతి, గండి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సాగునీరందక రైతుల అవస్థలు

- డీ వన్ కాల్వ పునరుద్ధరణకు డిమాండ్
- పలుచోట్ల సొంతఖర్చులతో పూడికతీత



సొంతఖర్చులతో పూడిక తీసిన కాల్వను చూపుతున్న రైతులు

మంగపేట: మండలంలోని మల్లూరు వాగు మధ్యతరహా ప్రాజెక్టు కుడికాల్వకు అనుసంధానమైన డీ వన్ కాల్వ కింద గల ఆయకట్టు భూములకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రాజెక్టు ప్రధాన కుడికాల్వకు అనుసంధానమైన డీ వన్ కాల్వ నిర్వహణను సంబంధిత ఐబీ అధికారులు గత 15 ఏళ్ల క్రితం నుంచి పట్టించుకోకపోవడంతో కాల్వ కూడి పోయిందని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు సమృద్ధిగా పడటంతో ప్రాజెక్టు మత్తడి పడిందని సంబురపడినప్పటికీ ప్రస్తుత మూడు నెలల కాలంలో వర్షాలు లేకపోవడంతో కంకిదశలో ఉన్న వందలాది ఎకరాల వరిపంటకు సాగునీరు అందే అవకాశం లేకుండాపోయింది. దీంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. కల్లెదుటే పంట ఎండిపోతుండటంతో కొందరు రైతులు స్వంత ఖర్చులతో జేసీబీ సాయంతో పూడుకుపోయిన కాల్వను తవ్వించేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ, తలకుమించిన భారం కావడంతో అటు పంట ఎండిపోతుంటే చూడలేక కాల్వ తవ్వించేందుకు ఆర్థిక స్తోమత లేక ఆవేదన చెందుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించాలని కోరారు. ఎండిపోతున్న పంటలను కాపాడి రైతులను ఆదుకునేందుకు ఆయకట్టు సాగు భూములకు సాగునీరు అందించే విధంగా ఐబీ అధికారులు తక్షణమే చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

వైద్య శిబిరం



ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న వైద్య బృందం

ములుగు రూరల్: జిల్లాకేంద్రంలో అపోలో రిచ్ ఎస్ఎస్ఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు శనివారం వైద్య శిబిరాన్ని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌ను ఆస్పత్రి జనరల్ మేనేజర్ సుమన్, మెడికల్ ఆఫీసర్ రాజకుమార్‌లు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఉపేక్షించం



పోలీసులు సీజ్ చేసిన ఇసుక లారీలు

ఏటూరునాగారం: ఏటూరునాగారం మారుమూల ఏజెన్సీ గ్రామీణ ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్సై తాజొద్దీన్ అక్రమార్కులను హెచ్చరించారు. అనుమతులు లేకుండా నాలుగు ఇసుక లారీలు వే బిల్స్ లేకుండా వెళ్తుండడంతో ఆ దివారం రాత్రి సీజ్ చేశామని ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా తాజొద్దీన్ మాట్లాడుతూ ఎస్పీ శబరీశ్ ఆదేశాల మేరకు ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్ సూచనల మేరకు పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక లారీలలో అక్రమంగా రవాణా చేస్తున్న రెండులారీలు పోలీసులను తప్పించుకొని వెంకటాపురం సమీపంలోకి వెళ్లగా వాటిని కూడా పట్టుకున్నామన్నారు. పట్టుబడిన ఇసుక లారీలు జంగాలపల్లి గ్రామానికి చెందిన లంకెల శ్యామ్ అనే వ్యక్తికి చెందినవిగా గుర్తించినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా వాజేడు మండలం భీమవరం ఇసుక రిచ్ నుంచి తరలిస్తున్నట్లు వెళ్లడైందన్నారు. అక్రమ దందాలకు పాల్పతే కేసులు నమోదు చేస్తామన్నారు.

జేసీబీతో చెట్ల తొలగింపు



మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని పెద్దమ్మ చెరువు కట్టకు ఇరువైపులా తుమ్మ చెట్లు పెరగడంతో వ్యవసాయ దారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎర్రబెల్లి పున్నంచందర్‌రావు తన సొంత ఖర్చులతో జేసీబీ సాయంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుమ్మచెట్లను తొలగించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేయడంతోపాటు, పున్నంచందర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదాలు నివారించు తల్లీ..

- ఎర్రమ్మ దేవతకు భక్తుల పూజలు



ఎర్రమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

ఏటూరునాగారం: నిత్యం జరుగుతున్న ప్రమాదాలను నివారించాలని ఆదివారం ఎర్రమ్మ దేవతకు ఘనంగా పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని వై జంక్షన్ సమీపంలోని ఎర్రమ్మ దేవతకు ప్రతి సంవత్సరం పూజలు నిర్వహించి యాటపోతులను బలివ్వడం ఆనవాయితీ. అదే తరహాలో ఈ సంవత్సరం కూడా ఆలయ కమిటీ చైర్మన్ వంగూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సూర్యనారాయణ శర్మ.. ఎర్రమ్మ తల్లికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించి ధూపదీప నైవేధ్యాలను సమర్పించారు. కాగా పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని చీర సారేలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ గుడి వద్దకు చేరుకొని మొక్కులు సమర్పించారు. కమిటీ సభ్యులు ఆయనను గౌరవప్రదంగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వలస శ్రీనివాస్, గురప్రు రంగయ్య, నరసయ్య, నల్లబోయిన కోటయ్య, చిప్ప అశోక్, భక్తులు కర్ర రవీందర్, సర్వ వెంకన్న, ఇరుసవడ్ల భిక్షపతి, చేన్న ముత్తయ్య, తిరుపతి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాలమహానాడు ఆవిర్భావ వేడుకలు



జెండాను ఎగురవేస్తున్న శివకుమార్

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఆదర్శకాలనీలో మాల మహానాడు 18వ ఆవిర్భావ వేడుకలను ఆదివారం మాల మహానాడు నాయకులు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంపల శివకుమార్ మాలమహానాడు జెండాను ఎగురవేశారు. మాల మహానాడు వ్యవస్థాపకుడు దివంగత కాలేశ్వరం ప్రకాశం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాళ్ల రామకృష్ణ, గంపల నర్సయ్య, కిరణ్, చందు, మాదరి మధు, చంద్రబాబు, సమ్మయ్య, రామకృష్ణ, రాంబాబు, నారా ప్రశాంత్ పాల్గొన్నారు.